కవితా కౌముది

# ప్రస్థానం

ఆర్.వి.రాఘవరావు

ఉగ్గబట్టిన కన్నీళ్ళు, ఎగసిపడే ఎక్కిళ్ళ మధ్య
అర్థాయుష్షు లో ఆరిన ఆ రెండుపదుల దేహం
అగ్ని చెంతకు చేరి చివరకు భగ్నమవటం

అణచుకున్న నిట్టూర్పులు, అర్థంకాని అసహనాల నడుమ
కలలు చేజార్చుకున్న ఆ కడు వృద్ధ ప్రాణమూ
కాలం లోకి క్రమక్రమంగా కదలిపోవటం

నిండిన ఏవగింపులు, నిండుకున్న మానవత్వాల నడుమ
అసలు వయసే తెలియని ఆ అనాథ ప్రేతం సైతం
అలా అలా ఆ దారిలోకే జారిపోవటం

జననమరణాల మధ్య ఉనికిని ఉఫ్‌మని ఊదేసిన
ఆ అంతిమ గమ్యం అగమ్యమే కావచ్చు

శాశ్వతమన్న ఆత్మవంచన ఆశాభంగమైన క్షణం
ఈ అర్థాంతర అంతర్ధానమూ అనివార్యమే కావచ్చు

కాని......
తీరిన కాంక్షలు, తీరని లక్ష్యాలు
పొందని వరాలు, పొందిన శాపాలు
సత్యాలు, స్వప్నాలు, క్లేశాలు, సౌఖ్యాల సమస్తాన్ని
భుజాన మోసుకుంటూ...
భుజభుజాలు మార్చుకుంటూ
మనిషి నుంచి మనిషి కి సాగే ఈ మహాప్రస్థానం మాత్రం
అజరం, అమరం, అనంతం...ఓ మహా అద్భుతం.

# ఆచూకీ లేని ఇష్టాలు

## శ్రీసాహితి

నన్ను పారేసుకుని
 నీలో వెతుకుతుంటే....
నాలో ఏదో వెతుకుతూ
 నీవు కనపడ్డావు....!
ముఖముఖాలు రాసుకుని
 గీతలు పడ్డ చూపుల్లో
ఒకరినొకరు తడుముకుని
 కళ్ళు తలుపులు తెరచుకుని
ఆచూకి లేని ఇష్టాలు
అర్ధాకలితో ఎదురుపడి
ఒకరి బాధలో మరొకరిని గుర్తించి
కమిలిన మాటలను ఊరటలో ముంచి తేల్చి

పాత రోజులను పిలచి
 కొత్త ఊహల్ని పరిచయం చేసి
మెత్తగా అల్లుకునే క్షణంలోని నిజాయితీకి
 మంచులా కలిగిన కాలం!
గడ్డకట్టిన కథలో చల్లగా చేరి
చెదపట్టిన రోజుల
చెరపట్టిన భావాలను
విడిపించి, విధిలించి, వివరించే మనసుతో,
నీలో దొరకిన నన్ను
 నీకే అప్పగించాలని
నాలో వెతికే నీ గుర్తులను
 నీకే చూపించాలని..

★★★

# మాటలు

## భమిడిపాటి స్వరాజ్య నాగరాజా రావు

మౌనం గుట్టును ములిపెంగా విప్పేవి,
దూరం లోయను మధురంగా కప్పేవి
ఇరుమనసులను మృదువుగా కలిపేవి
వాటిమధ్యన మమతల రాయభారం సలిపేవి
స్నేహపూరితమైన మాటలే!
అద్వైతం అర్థమయ్యేలా చేసేవి,
ద్వైతం నుండి జారిపోకుండా చూసేవి
జ్ఞానపురితమైన మాటలే!
తూటాలుగా మారి మనసును విచ్ఛిన్నం
చేసేవి,
మనసుల మధ్యన చీలికలను సృష్టించేవి
కఠినమైన మాటలే!
అందమైన పాటలుగా మారి జీవితాన్ని
నందనవంగా మార్చేవి,
ఆనందపు వూటలుగా మారి తన్మయత్వాన్ని
కలిగించేవి,
తన్మయత్వపు తోటలని చూపేవి,
మధురమకరందపు తేటలని రుచి చూపేవి
తీయని మాటలే!
మాటలే కదా అని వాటిని తేలికగా తీసుకోకు.
తాటను తీయించేవి,తీటను వదిలించేవి,
చేటును కలిగించేవి,తెరచాటుకు పంపించేవి
 సరిగా లేని మాటలే!

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

అరయుచుందు శైశవపు చిత్తరువు నాది
వత్సరములెన్నియో యందు ప్రతిఫలించు
ఎంత రూపము మారిన సుంత యైన
నేను కానను తలపు నాకేల కలుగు?

ఎవ్వరీ బాలుడని యెప్పుడెంతమంది
సంశయించిన నాకు సంశయము రాదు
కాంచునది నాదు రూపురేఖలను గాదు
మానసానంద శుద్ధాంతమందిరమును

కాలమెట్టులో గమియించి కరగిపోయె
దినములు వత్సరమ్ములదృశ్యమయ్యె
కరగిపోయిన కాలము తిరిగి రాదు
తిరిగి రాకయు నిల్చు మస్తిష్కమందు

రూపు మారిన, తనువెంత క్రొత్తదనము
సంతరించుకొనినను, శైశవము నాటి
మనసులోపలి యోచనల్ మరల మరల
తలపునకు వచ్చిమదికి సంతసము కూర్చు

జీవితమ్మననేమి నా స్మృతిపథాన
నిలచి యున్నట్టి జ్ఞాపకావళులు గాక
మరచిపోయిన క్షణములు మాయమగును
జ్ఞప్తినున్నవే జీవితసారమగును

COMMENTS